సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం। 12। మార్చి। 2024



రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి అద్దంకి సతీష్, దుర్గా శ్యామల దంపతులు (బెంగళూరు) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



ఇక పారిశ్రామిక పరుగులు

రాజానగరం మండలం కలవచర్లలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్కుకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ నేడు శంకుస్థాపన చేయనున్నారు. - 8లో▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సెహరీ బుధ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.52
కాకినాడ	6.21	4.52
అమలాపురం	6.21	4.52

న్యూస్‌రీల్

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.75 అడుగులుగా కొనసాగుతోంది.

పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వెంటనే వాటిపై చట్ట ప్రకారం విచారణ జరిపించి, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సివిల్ కేసులు 2, కుటుంబ కలహాలు 2, మోసాలపై 2, ఇతర కేసులు 16 వచ్చాయి. వీటిలో ఈస్ట్ జోన్‌కు సంబంధించి 9, సౌత్ జోన్ 4, సెంట్రల్ జోన్ 7, కొవ్వూరు సబ్ డివిజన్‌కు సంబంధించి 2 చొప్పున ఫిర్యాదులు అందాయి.

దివ్యాంగులను మానవత్వంతో ఆదుకోవాలి



దివ్యాంగుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వం చూపాలని, చేతనైన సహాయ సహకారాలు అందజేసి ఆదుకోవాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వీఎల్ పురంలోని ఆయన కార్యాలయంలో దివ్యాంగులకు సోమవారం వివిధ ఉపకరణాలు పంపిణీ చేశారు. గత డిసెంబర్ నెలలో అలింకో సంస్థ ద్వారా దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. దీనికి హాజరైన 601 మంది దివ్యాంగులకు రూ.1.27 కోట్ల విలువైన 900 ఉపకరణాలను ఎంపీ భరత్ రామ్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అందజేశారు. వీటిలో 217 బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ వెహికల్స్, 78 ట్రై సైకిల్స్, హియరింగ్ ఎయిడ్స్, కృత్రిమ అవయవాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ, బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ వెహికల్ ఒక్కొక్కటి రూ.50 వేలు అని, మొత్తం 217 మందికి వీటిని అందజేశామని తెలిపారు. వీటికి తన ఎంపీ నిధులు రూ.30 లక్షలు కేటాయించగా, మిగిలిన సొమ్ము కేంద్ర ప్రభుత్వం భరించిందన్నారు. ఈ పంపిణీ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. అనంతరం బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ వెహికల్స్ అందుకున్న లబ్ధిదారులు ఎంపీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ నగరంలోని పలు ప్రధాన జంక్షన్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీ భరత్, రుడా చైర్మన్ సూర్యప్రకాశరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావీస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యాన ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి జపాన్‌లోని ఆసుపత్రుల్లో కేర్ టేకర్లుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 32 సంవత్సరాల లోపు వారు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. వారికి జపనీస్ భాష ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిల్లో నేర్పించి, బెంగళూరులో ఆరు నెలల శిక్షణ ఇస్తారని తెలిపారు. దీనికి రూ.3,50,000 ఫీజును అభ్యర్థి మూడు వాయిదాల్లో చెల్లించాలన్నారు. పాక్షిక శిక్షణ రుసుం రూ.50,000లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25,000 చెల్లిస్తుందని, మిగిలినది అభ్యర్థి చెల్లించాలని తెలిపారు. ఆరు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జపాన్‌లో ఉద్యోగావకాశం కల్పించడానికి అవసరమైన ఏర్పాట్లను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావీస్ హెచ్‌ఆర్ సంస్థ పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగం పొందిన వారికి నెలకు రూ.1,10,000 నుంచి రూ.1,40,000 వరకూ జీతం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు http://www.appsc.in/home/online లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 73867 06272 నంబరులో సంప్రదించాలని కొండలరావు సూచించారు.

చిరుద్యోగుల్లో చిద్విలాసం

- కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ ఉత్తర్వులు
- జీవితాంతం రుణపడి ఉంటామంటున్న ఉద్యోగులు
- ఉమ్మడి జిల్లాలో 267 మందికి మేలు



కాకినాడ డీఎంహెచ్‌ఓ నుంచి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అందుకున్న హెల్త్ అసిస్టెంట్లు (ఫైల్)

మామిడికుదురు/కొత్తపేట: శుభ తరుణం రానే వచ్చింది.. కాంట్రాక్టు బతుకులకు వెలుగులు తెచ్చింది.. రెండు దశాబ్దాల కల నెరవేర్చింది.. వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్న బడుగు ఉద్యోగుల కల ఫలించింది. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి ఉద్యోగాలకు భరోసా కల్పించింది. జీఓ 30, జీఓ 31 ద్వారా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు-మేల్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్లు-ఫీమేల్, గ్రేడ్-2 ఫార్మసిస్టుల ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ ఇటీవల జారీ చేసిన జీఓలు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎనలేని సంతోషాన్ని తెచ్చింది. ఈ శుభ తరుణం కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో పోరాటాలు చేశారు.. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఎంతో మందిని కలిశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని బాధపడ్డారు. తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు తీపి కబురు తీసుకొచ్చింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ జారీ చేసిన జీఓ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

ఎంతమందికి ప్రయోజనమంటే..

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీఓ ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 267 మంది ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. జీఓ 30 ప్రకారం హెల్త్ అసిస్టెంట్లు 170 మంది, 31 జీఓ ప్రకారం మహిళా ఉద్యోగులు 44 మంది, గ్రేడ్-2 ఫార్మసిస్టులు ఎనిమిది మందికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేశారు. మరో 45 మందికి సాంకేతిక కారణాలతో ఉత్తర్వులు జారీ చేయడంలో కొంత జాప్యం ఏర్పడింది. వారికి కూడా ఉత్తర్వులు ఇచ్చేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వీరు 2003 జూన్ 3న ఉద్యోగాలు పొందారు. నాటి నుంచి నేటి వరకూ కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగుతున్నారు. ఇటీవల జారీ చేసిన జీఓలతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. తమకు భరోసా ఇస్తూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు పట్టరాని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సాహసోపేత నిర్ణయం



మా ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తూ తీసుకున్న నిర్ణయం సాహసోపేతం. మాకు నరకం నుంచి విముక్తి కలిగించిన మహానుభావుడు జగన్. ఆయన రుణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది. ఆయనే మళ్లీ సీఎం కావాలి. ఇదే ప్రజలూ కోరుకుంటున్నారు. మాలాంటి ఉద్యోగుల మాట కూడా అదే. ఎవరు ఎన్ని చెప్పినా నిస్సందేహంగా చెబుతున్నా.. జగనే సీఎం.

– వీఎస్‌జే కుమారి, ఏఎన్ఎం, యూపీహెచ్‌సీ, మెరక వీధి, రాజమహేంద్రవరం

ఎంతో రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు ఇంత కాలానికి ఫలించాయి. ఇప్పటి వరకూ ఎన్నో ఇబ్బందులు పడ్డాం. చాలీచాలని జీతంతో పని చేశాం. మా జీవితాలకు ఒక దశ, దిశ నిర్దేశించిన మహానుభావుడు జగన్‌మోహన్‌రెడ్డి. మా కుటుంబం అంతా ఆయనకే తోడుగా నిలుస్తాం. ఉద్యోగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ ఆనందాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు.

–కొమ్మూరి ఉమామహేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్, లూటుకుర్రు పీహెచ్‌సీ, మామిడికుదురు మండలం

గుండెల్లో పెట్టుకుంటాం



గత ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తున్న జగన్‌ను కత్తిపూడిలో ఐదుగురు సభ్యులం కలిశాం. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరాం. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే పర్మినెంట్ చేస్తామని జగన్ మాట ఇచ్చారు. ఇచ్చిన మాటను ఎక్కడా తప్పలేదు. మా ఉద్యోగాల్ని పర్మినెంట్ చేయడం అద్భుత ఘట్టం. జగన్‌ను గుండెల్లో పెట్టుకుంటాం.

– దుళ్ల చటర్జీ, ఏపీ పారా మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాజమహేంద్రవరం, హెల్త్ అసిస్టెంట్, ఫైలేరియా

జీవితాలకు వెలుగులొచ్చాయ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ఉద్యోగులందరం స్వాగతిస్తున్నాం. మా ఆనందానికి అవధులు లేవు. పాదయాత్రలో ఇచ్చిన మాట ఎక్కడా తప్పలేదు. ఎంతో మంది పాలకులు వచ్చినా మా సమస్యలు ఆలకించలేదు. ఉద్యోగులంతా సీఎంకు రుణపడి ఉంటాం.

– ముల్లేటి ఏడుకొండలు, హెల్త్ అసిస్టెంట్, నగరం పీహెచ్‌సీ

కొత్త జీవితాన్ని ప్రసాదించారు



ఇరవై ఏళ్ల నుంచి ఎంతో మంది పాలకులు వచ్చారు.. వెళ్లారు. కానీ మా వెతలు తీర్చలేదు. మాజీ సీఎం చంద్రబాబు ఎన్నో సాకులు చెప్పి మాట దాట వేశారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నెరవేరుతుందా! లేదా! అనే సందేహంలో ఉన్నాం. ఆ హామీని జగనన్న తు.చ. తప్పకుండా నెరవేర్చారు. మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు.

– కుడుపూడి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్, మామిడికుదురు మండలం

నిరీక్షణ ఫలించింది



ఇరవై ఏళ్ల నిరీక్షణ సీఎం జగన్ చొరవతో ఫలించింది. మేమంతా పట్టరాని ఆనందంలో ఉన్నాం. జగన్ రుణం తీర్చుకునే అవకాశం కోసం ఆశగా ఎదురు చూస్తున్నాం. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయన్ని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకా ఎంతో మంది జీవితాలకు వెలుగులు వస్తాయి.

– యర్ల రాజేష్, ఫార్మసిస్టు, దోసకాయలపల్లి పీహెచ్‌సీ, కోరుకొండ మండలం

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రానున్న ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జిల్లాలోని పోలీసు అధికారులతో స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం చేయాల్సిన, చేయకూడని పనులపై వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పలు అంశాలను జోనల్ డీఎస్పీలు వివరించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాలు, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్స్, పార్కింగ్ ప్రదేశాలు, రూట్ మొబైల్స్, రూట్ మ్యాప్స్, బందోబస్తు నిర్వహణ, పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టం, యాక్టివ్ రౌడీషీటర్లు, బైండోవర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్, గత ఎన్నికల సమయంలో నమోదైన కేసుల వివరాలను పోలీస్ స్టేషన్ల వారీగా సంబంధిత అధికారులు ఎస్పీకి వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల రోజున ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ హాల్స్, రిసెప్షన్ సెంటర్లు, పార్కింగ్ ప్రదేశాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గత ఎన్నికల్లో నమోదైన కేసులను విశ్లేషిస్తూ, రానున్న ఎన్నికలలో వాటిపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి రోజూ కేంద్ర పోలీస్ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలని సూచించారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సమస్యలు సృష్టించే వారు, రౌడీషీటర్లను బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఎస్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను ఎన్నికల విధుల్లో ఉపయోగించుకోవాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై ప్రజలకు ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్, డీఎస్పీలు ప్రభాకర్, జోనల్ డీఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 3 లక్షల ఎకరాల పంపిణీ



లంక భూముల లీజు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు

- ఆ ఘనత సీఎం జగన్‌దే
- మంత్రి చెల్లుబోయిన వేణు
- 86.75 ఎకరాల లంక భూములకు లీజు పట్టాల పంపిణీ
- వెంకట నగరంలో 109 మందికి లబ్ధి

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 3 లక్షల ఎకరాలు పంపిణీ చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ ఎస్సీ సొసైటీ పేరిట వెంకట నగరం గ్రామంలో 109 మంది సాగు చేసుకుంటున్న 86.75 ఎకరాల లంక భూములకు ఐదేళ్ల లీజు పట్టాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ, ప్రతి పేదవాడు ఆర్థికంగా ఎదగాలనే ఏకైక లక్ష్యంతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఒక్క పేదవాడికి కూడా ఇంటి స్థలం కానీ ఇల్లు కానీ ఇవ్వలేదని చెప్పారు. రూరల్ నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనుకుంటే స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ మరోసారి ఆశీర్వదించాలని మంత్రి వేణు కోరారు. అనంతరం తొర్రేడు గ్రామానికి చెందిన ఐదుగురికి ఆయన లీజు పట్టాలు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రమ్య, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు చెల్లుబోయిన నరేన్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మోతా రమేష్, ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు గుమ్మడి వీర్రాజు, కొల్లపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- హోం మంత్రి తానేటి వనిత
- మహిళలకు రూ.7.33 కోట్ల చేయూత చెక్ అందజేత



మహిళలకు చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి వనిత, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

దేవరపల్లి: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అందజేస్తున్న పెట్టుబడి సొమ్ముతో మహిళలు సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. వైఎస్సార్ చేయూత పథకంలో లబ్ధిదారులైన మహిళలకు రూ.7.33 కోట్ల నమూనా చెక్కును దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి వనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల రూపంలో నెరవేరుస్తున్నారని, పేద కుటుంబాలు పేదరికం నుంచి బయటపడాలనే ఆలోచనతో వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా బలపడాలన్నది సీఎం జగన్ ఆలోచన అని ఆమె తెలిపారు. కుటుంబ యజమానికి మహిళల సంపాదన కూడా తోడైతే ఆ కుటుంబం ఆర్థికంగా బలోపేతమవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని పేదలందరూ ఆర్థికంగా బలపడినట్టు నమ్ముతున్నామని, గత ప్రభుత్వ హయాంలో 12 శాతంగా ఉన్న పేదరికం.. జగనన్న పాలనలో 6 శాతానికి తగ్గినట్టు కాగ్ నివేదిక ఇచ్చిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని మంత్రి వనిత కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత

దేవరపల్లిలోని జగనన్న లే అవుట్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను మంత్రి వనిత అందజేశారు. ఇప్పటి వరకూ 850 మందికి స్థలాల రిజిస్ట్రేషన్ జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ కడిమి వీరకుమారి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల మహిళా కన్వీనర్ కె.హైమావతి, వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, ఎంపీటీసీ సభ్యులు పల్లికొండ రామలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గడా రాంబాబు, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

- పీఎం లాఖ్‌పతి దీదీ పథకంలో రూ.30 లక్షల రుణాలు
- జిల్లా వ్యాప్తంగా 21 సంఘాలకు లబ్ధి
- డ్వాక్రా మహిళలకు రూ.112.86 కోట్ల బ్యాంకు రుణాలు
- లబ్ధిదారులకు నమూనా చెక్ అందించిన కలెక్టర్



ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పేద మహిళలను లక్షాధికారులను చేయడమే పీఎం లాఖ్‌పతి దీదీ పథకం లక్ష్యమని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని 21 స్వయం సహాయక సంఘాలకు రూ.30 లక్షలు, డీఆర్‌డీఏ ద్వారా 1,188 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.112.86 కోట్ల మేర బ్యాంక్ లింకేజి రుణాలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన నమూనా చెక్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌తో కలసి కలెక్టర్ మాధవీలత సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారతే పీఎం లాఖ్‌పతి దీదీ పథకం లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా రూ.లక్ష కంటే తక్కువ ఆదాయం కలిగిన మహిళలకు ఎల్ఈడీ బల్బులు, ప్లంబింగ్, డ్రోన్ మరమ్మతుల వంటి టెక్నికల్ స్కిల్స్ నేర్పిస్తారని వివరించారు. దీనిలో భాగంగా దేవరపల్లి, అనపర్తి, పెరవలి మండలాలకు గ్రామ రివాల్వింగ్ నిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.30 లక్షల మేర ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. తద్వారా ఈ మూడు మండలాల్లోని 21 స్వయం సహాయక సంఘాలకు చెందిన 210 మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

17న గ్రూప్-1 పరీక్షలు

జిల్లాలోని 25 కేంద్రాల్లో ఈ నెల 17న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ మాధవీలత తెలిపారు. వీటిని అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్, రూట్ అధికారులు ముందస్తుగా ఆయా విద్యా సంస్థ యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా 8,258 మంది ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పరీక్ష పేపర్-1 ఉదయం 10 నుంచి 12 వరకూ, పేపర్-2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ జరుగుతాయని వివరించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా నోడల్ అధికారిగా జేసీ తేజ్‌భరత్ వ్యవహరిస్తున్నారన్నారు. తనిఖీల కోసం మహిళలకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, తాగునీరు తదితర కనీస సౌకర్యాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొబైల్ ఫోన్లు భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆర్టీసీ, రవాణా అధికారులు ఆయా మార్గాల్లో బస్సులు, ఆటోలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో విడుదల కానున్న దృష్ట్యా క్షేత్ర స్థాయిలో వివిధ పనులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే ప్రారంభించి, నివేదిక అందజేయాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఎన్నికల విధులపై శాఖల వారీ మంజూరు చేసిన పనులపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీరు, ఇతర అనుబంధ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన పెంచుకుని, కచ్చితంగా అమలు చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు సంబంధించి సభాస్థలి, ఇతర వివరాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అందజేయాలని తెలిపారు.

స్పందనకు 152 అర్జీలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై 152 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ అర్జీలు స్వీకరించారు. వీటి సత్వర పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనం చేకూర్చేలా అర్జీదారులకు మార్గదర్శకం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో జేసీ తేజ్‌భరత్‌తో పాటు డీఆర్‌ఓ జి.నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, స్త్రీనిధి ఏజీఎం ధర్మేంద్ర, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం



యర్రమట్టిపురంలో పట్టుకున్న అక్రమ రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

రాయవరం: చెల్లూరు గ్రామ పరిధి యర్రమట్టిపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. కోట సత్యం అనే వ్యక్తి 24 బస్తాలలో సుమారు 1,035 కిలోల పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. చెల్లూ రు, పసలపూడి గ్రామాల్లో రేషన్ కార్డుదారుల నుంచి కిలో రూ.14కు కొనుగోలు చేసి మొక్కజొన్న విత్తనాలతో కలిపి రూ.16కు కోళ్ల ఫారాలకు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ. 53,092 ఉంటుందని అంచనా వేశారు. బియ్యంతో పాటు ఎలక్ట్రానిక్ కాటాను సీజ్ చేసి, 6ఏ కింద కేసు నమో దు చేశారు. నిందితుడు కోట సత్యం, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాల్లో చౌక బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నా రు. ఎవరైనా ఈ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి జగన్నాథరెడ్డి, రాయవరం సివిల్ సప్లయిస్ సిబ్బంది ఆలీషా, జీవానందం, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రాజోలు పోలీసుల కథనం ప్రకారం.. తాటిపాక మఠం గ్రామానికి చెందిన మామిడిశెట్టి వెంకట్రావు (65) సోమవారం పొదలాడ మీదుగా మొగలికుదురులోని పొలానికి సైకిల్‌పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో పొదలాడలో వెంకట్రావును వెనుక నుంచి భీమవరం నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక పారిశ్రామిక పరుగులు

- కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కు
- రూ.60.65 కోట్లతో పనులు
- నేడు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి భూమిపూజ
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు



ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కలవచర్లలో కేటాయించిన ప్రాంతం

రాజానగరం: ఇక పారిశ్రామిక రంగం పరుగులు పెట్టనుంది.. యువతకు ఉపాధి దరిచేరనుంది.. ఈ సదుద్దేశంతో రాజానగరం మండలం కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కు రూపుదిద్దుకునేందుకు మార్గం సుగమం కానుంది. సుమారు రూ.60.65 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ మంగళవారం ఉదయం ఇక్కడ భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి భారత ప్రభుత్వ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఉమేష్‌చంద్ర శుక్లా గత ఏడాది నవంబరు 21న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో నియోజకవర్గంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, పారిశ్రామిక ప్రగతితో పాటు నిరుద్యోగులకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పించాలనే రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సంకల్పం కార్యరూపం దాల్చనుంది. ఇది పూర్తయితే స్థానికంగా యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి. ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బంది తప్పుతుంది. ఈ ప్రాజెక్టును ఎమ్మెల్యే రాజా ప్రతిష్టాత్మకంగా తీసుకుని, శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కు కోసం రాజానగరం మండలం కలవచర్లలో సుమారు రూ. 40 కోట్లతో ఇప్పటికే 104 ఎకరాల భూమిని సేకరించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం మరో రూ. 20.65 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ వ్యయంలో కేంద్రం రూ. 10.50 కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా కేటాయించగా, మిగిలిన రూ. 10.15 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా సమకూర్చనుంది. ఈ మొత్తంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ. 12.71 కోట్లు, నీటి సదుపాయం, మురుగునీటి పారుదల వ్యవస్థలకు రూ. 7.63 కోట్లు, ప్రీ అపరేటివ్ ఖర్చులకు కోసం రూ. 30 లక్షలు ఖర్చు చేయనున్నారు. ఈ పనులకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి



నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను సాధ్యమైనంత వరకూ పరిష్కరించాలనే సంకల్పంతో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఇప్పటికి కార్యరూపం దాలుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. దీనివల్ల ఈ ప్రాంతం పారిశ్రామిక ప్రగతిని అందుకోవడంతో పాటు వేలాది మంది స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇందుకు అవసరమైన సహకారం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

దోపిడీ కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

రామచంద్రపురం రూరల్: ఏరుపల్లిలో జరిగిన దోపిడీ ఘటనకు సంబంధించి ఏ–2 ముద్దాయికి రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.వెంకటేశ్వరరావు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, విధిస్తూ తీర్పు చెప్పినట్లు ద్రాక్షారామ ఎస్సై గెల్ల సురేంద్ర సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏరుపల్లిలోని చల్లా వెంకటేశ్వరరావు ఇంట్లోకి 2010 డిసెంబర్ 30న అర్ధరాత్రి నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన తిల్పిడియా రంజిత్‌సింగ్ (బండా సింగ్) మరో 7 మందితో కలసి చొరబడి దోపిడీకి పాల్పడ్డాడు. చల్లా వెంకటేశ్వరరావు, అతని భార్య, మరో వ్యక్తి అల్లూరి పార్వతిలపై కత్తితో దాడిచేసి వారిని గాయపరిచి బంగారు తాడు, 4 బంగారు గాజులు దోచుకుపోయారు. బాధితుల ఫిర్యాదుపై అప్పటి ఎస్సై ఎండీ ఉమర్ కేసు నమోదు చేశారు. సీఐ ఎం.రాజారావు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ప్రస్తుత ఎస్సై గెల్ల సురేంద్ర స్పీడ్ ట్రైల్ కేసుగా గుర్తించి కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్యతో కలసి సాక్షులను కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

మద్యం అక్రమ రవాణా ముఠా అరెస్టు

తణుకు: పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం దిగుమతి చేసుకుని స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్న ముఠా సభ్యులను సోమవారం తణుకు పోలీసులు అరెస్టు చేశారు. అరుణాచల్ ప్రదేశ్ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కరావారి సావరం గ్రామానికి చెందిన బోయిన బాలాజీ, రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మల రాధాకృష్ణ గిరీష్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద రూ.1.20 లక్షల విలువైన 220 మద్యం బాటిళ్లతో పాటు కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిందితులు ఇజ్జాడ పాపినాయుడు, మాకా రాజేష్, గండ్రోతు ఏసుబాబులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

పంట పొలంలో వ్యక్తి మృతదేహం

కొత్తపల్లి: ఓ పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని కొండెవరం శివారు గోదావరి కాలువ సమీపంలోని పంట పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైతు గుర్తించాడు. అతని వయసు 45–50 ఏళ్లు ఉంటుందని ఎస్సై స్వామినాయుడు తె లిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భద్రతపై అవగాహనకే వాక్‌థాన్



వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఓఎన్జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతనుదాస్

ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంతనుదాస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పారిశ్రామిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు చైతన్యం తీసుకురావడానికే వాక్‌థాన్ నిర్వహిస్తున్నట్లు ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శంతనుదాస్ అన్నారు. సోమవారం ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఆధ్వర్యంలో 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక గెయిల్ కార్యాలయం నుంచి ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్ ఆవరణ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. తొలుత దీనిని శంతనుదాస్ ప్రారంభించి మాట్లాడారు. ఓఎన్జీసీ తన ఆరోగ్య భద్రత- పర్యావరణ (హెచ్ఎస్ఈ) విభాగం ద్వారా చమురు- గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతా సంస్కృతిని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం 'నేషనల్ సేఫ్టీ వీక్' నిర్వహిస్తుందన్నారు. ఈ ఏడాది ఈఎస్‌జీ ఎక్సలెన్స్ కోసం భద్రతా నాయకత్వంపై దృష్టి పెట్టండి అనే నినాదంతో అనేక మాక్‌డ్రిల్‌లు, కార్యక్రమాలను నిర్వహించామన్నారు. రాజమహేంద్రవరం అసెట్ ఎల్లప్పుడూ ప్రమాదాలను నివారించడానికి, ఉద్యోగులందరికీ భద్రత కల్పించడానికి శ్రద్ధ వహిస్తుందన్నారు. ప్రచార సమయంలో, పారిశ్రామిక భద్రత గురించి ప్రజలను చైతన్యపరిచేందుకు కార్యాలయాల వద్ద సురక్షిత అభ్యాసాలపై వర్క్‌షాప్‌లు, కార్యాచరణ ప్రాంతాల చుట్టూ మాక్‌డ్రిల్‌లతో సహా అనేక కార్యకలాపాలు జరిపామన్నారు. అవసరమైన ప్రవర్తనా మార్పు తీసుకురావడానికి, సానుకూల మార్పులను అమలు చేయడానికి పాఠశాల విద్యార్థులను చైతన్యవంతం చేయడానికి క్విజ్‌లు, పోస్టర్ తయారీ, నినాదాల పోటీలు కూడా నిర్వహించామని ఎసెట్ మేనేజర్ వివరించారు. కార్యక్రమంలో బేసిన్ మేనేజర్ కర్వానస్, సీనియర్ అధికారులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్రత పురోహితులకు ఆరోగ్య బీమా



వ్రత పురోహితుల ఆరోగ్య బీమా ప్రీమియం చెక్‌ను స్టేట్ బ్యాంక్ బీఎం రఘురామ్‌కు అందిస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

- భార్యాభర్తలకు ఏడాదికి రూ.6 లక్షల వైద్య సేవలు
- అవసరమైతే మరో రూ.3 లక్షల మంజూరు
- 254 మందికి ప్రయోజనం

అన్నవరం: స్థానిక వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పని చేస్తున్న 254 మంది వ్రత పురోహితులకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తూ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రూప్ మెడిక్లెయిమ్ హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఒప్పందం ఖరారు చేశారు. దీనికింద వ్రత పురోహితుల భార్యాభర్తలకు ఏడాదికి రూ.6 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తారు. ఆ మొత్తం చాలకపోతే పురోహితులందరి అనుమతితో మరో రూ.3 లక్షలు కూడా ఇన్సూరెన్స్ సంస్థ మంజూరు చేస్తుంది.

పురోహితుల ఆరోగ్య బీమాకు రూ.38.50 లక్షల ప్రీమియం చెల్లించేలా గత నెలలో ఒక ప్రైవేటు ఇన్సూరెన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకునేందుకు పురోహిత సంఘం నాయకులు దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఒక్కో పురోహితునికి వార్షిక ప్రీమియం కింద రూ.15 వేలకు పైగా చెల్లించాల్సి రావడంతో ఆ ప్రతిపాదనను ఈఓ తిరస్కరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ వైద్య సేవలు అందించేలా ఇన్సూరెన్స్ సంస్థల నుంచి కొటేషన్లు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై 'వ్రత పురోహితులకు మెరుగైన ఆరోగ్య సేవలు' శీర్షికన ఈ నెల 1న 'సాక్షి' వార్త ప్రచురించింది. దీంతో పలు ప్రముఖ ఇన్సూరెన్స్ సంస్థలు ఏడాదికి రూ.39 లక్షల నుంచి రూ.32.42 లక్షల వరకూ ప్రీమియం చెల్లించేలా దేవస్థానానికి కొటేషన్లు అందజేశాయి. వాటిలో స్టేట్ బ్యాంక్ గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీకి అతి తక్కువగా రూ.32,42,640కు అందజేసిన కొటేషన్‌ను దేవస్థానం ఆమోదించింది. ఆ మొత్తానికి చెక్కును ఈఓ కె.రామచంద్ర మోహన్ స్టేట్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ రఘురామ్‌కు అందజేశారు. ఈ నెల 14 నుంచి పురోహితుల ఇన్సూరెన్స్ క్లెయిములు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని రఘురామ్ చెప్పారు. తక్కువ ప్రీమియానికే హెల్త్ ఇన్సూరెన్స్ అందజేసి, వ్రత పురోహిత సంఘానికి రూ.6 లక్షలు ఆదా చేసిన ఈఓ రామచంద్ర మోహన్‌కు సంఘం మాజీ అధ్యక్షులు చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ, కర్రి సూర్యనారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ లోకల్ హెడ్ అనురాధ, ఇన్‌చార్జి శ్రీనివాస్, దేవస్థానం సూపరింటెండెంట్ కంచి మూర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సీతానగరం: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముగ్గళ్లకు చెందిన కొయ్య సుధీర్‌కుమార్ (34) మద్యానికి బానిస అయ్యాడు. దీనిపై భార్య మందలించి రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన సుధీర్‌కుమార్ సోమవారం ఉద యం పురుగు మందు తాగాడు. అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడని ఎస్సై వివరించారు.

శివనామ స్మరణతో సిరిసంపదలు



రౌతులపూడిలో శివతత్వంపై ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

రౌతులపూడి: నిత్యం శివనామ స్మరణ చేయడం ద్వారా మానవాళి సుభిక్షంగా ఉంటుందని శారదా జ్ఞానపుత్ర వాచస్పతి, ప్రవచన బ్రహ్మ కళారత్న చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో ఆయన శివతత్వంపై ప్రజలకు ఉద్బోధించారు. ఈ సందర్భంగా శివతత్వం విశిష్టత గురించి తెలుసుకుని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికభావాలు పెంపొందించుకోవాలన్నారు. శివనామ స్మరణతో ఆరోగ్యంతోపాటు, ప్రజలంతా సుఖ సంతోషాలు, సిరి సంపదలతో తులతూగుతారన్నారు. ఇది మనిషికి ప్రాణవాయువు వంటిదని, శివ పురాణంలో అనేక విశేషాలను ఆయన భక్తులకు వివరించారు. ఆయనకు ముందుగా ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. చాగంటి ప్రవచనాలను వినేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, శివభక్తులు పాల్గొన్నారు.

మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభం



మెడ్ యునైటెడ్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైతన్యరాజు తదితరులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో మెడ్ యునైటెడ్ ఆస్పత్రిని చైతన్య విద్యా సంస్థల చైర్మన్, జీజీయూ చాన్సిలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) సోమవారం ప్రారంభించారు. ఆధునిక పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల సేవలు ఇక్కడ ప్రత్యేకత అని ఆయన అన్నారు. తమ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ఆరోగ్య సంరక్షణతోపాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఇతరులు కూడా వైద్య సేవలు పొందవచ్చని చైతన్యరాజు వివరించారు. ఆస్పత్రి ప్రో చాన్సిలర్, అమలాపురం కిమ్స్ ఆస్పత్రి ఎండీ కె.రవికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో టెలీ మెడిసిన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆస్పత్రి ప్రో చాన్సిలర్, గైట్ కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆస్పత్రిలో జనరల్ వార్డును శశికిరణ్‌వర్మ, ఫార్మసీని రవికిరణ్‌వర్మ, కన్సల్టేషన్ గదులను డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎంఎంఎస్ శర్మ, ప్రత్యేక గదులను డాక్టర్ టీవీ ప్రసాద్ ప్రారంభించగా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మిశశివర్మ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.